## ఎస్సారార్ @ 21.73 టీఎంసీలు



బోయినపల్లి: ఎస్సారార్‌లో నీటిని పరిశీలిస్తున్న ఈఎన్‌సీ శంకర్

బోయినపల్లి, ఆగస్టు 4: బోయినపల్లి మండలం మాన్వాడలోని శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి వరద పోటెత్తుతున్నది. మూలవాగుతోపాటు వరద కాలువల నుంచి ప్రాజెక్టులకు 15,961 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. అదేవిధంగా 9,850క్యూసెక్కుల నీటిని దిగువనకు వదిలినట్లు ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం 27.54టీఎంసీల సామర్థ్యం గల ప్రా జెక్టులో బుధవారం నాటికి 21.73 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు వారు చెప్పారు. కాగా, ప్రాజెక్టును ఈఎన్‌సీ శంకర్ పరిశీలించారు. జలాశయానికి ఇన్‌ఫ్లో పెరుగుతుండగా, నీటి మట్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఈఈ జగన్, డీఈఈ శ్రీనివాస్, జేఈ జగన్నాథ్, తదితరులు ఉన్నారు.

### పెద్ద చెరువును పరిశీలించిన ఈఎన్‌సీ శంకర్

ముస్తాబాద్, సెప్టెంబర్ 4 : మండలంలోని ఎగువమానేరు ప్రధాన కాల్వ, షట్టర్లు, తూంలను ఈఎస్‌సీ శంకర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం గంభీరావుపేట మండలం నర్మాలఎగువ మానేరు ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు డీఈ రవికుమార్ తెలిపారు. ఇక్కడ నీటిపారుదలశాఖ ఏఈలు స్రవంతి, వంశీ, రాజు సిబ్బంది ఉన్నారు.

### మత్తడి దుంకిన ముస్తాబాద్ పెద్ద చెరువు



భారీ వర్షాలకు మత్తడి దుంకుతున్న ముస్తాబాద్ పెద్ద చెరువు

ముస్తాబాద్, సెప్టెంబర్ 4 : భారీ వర్షాలతో పైనుంచి వస్తున్న వరదలతో మండల కేంద్రంలోని పెద్దచెరువు జలకళను సంతరించుకొని బుధవారం మత్తడి దుంకింది. ముస్తాబాద్, పోతుగల్ గ్రామాల ప్రజలకు సాగు, తాగునీరు అందిస్తుంది పెద్ద చెరువు. చెరువు మత్తడి దుంకడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలు పెద్దసంఖ్యలో తరలిచ్చి చెరువు అందాలను చూస్తున్నారు.

## ప్రజాసేవలో ముందుంటాం • కేడీసీసీ డైరెక్టర్ తిరుపతిరెడ్డి



కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్‌గా ఎంపికైన తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 4: ప్రజా సేవ కోసం ముందుంటామని కేడీసీసీబీ డైరెక్టర్ ఏనుగు తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజపల్లిలో కేడీసీసీబీ డైరెక్టర్‌గా ఎన్నికైన తిరుపతిరెడ్డిని రెడ్డి సంఘం నాయకులు, సుభాష్‌యూత్ నాయకులతోపాటు పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొన్ని సంవత్సరాలుగా ప్రజాసేవలో తమ కుటుంబం ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. కొన్ని సంవత్సరాలుగా తమ కుటుంబానికి రైతులు, ప్రజలతో విడదీయని సంబంధం ఏర్పడిందన్నారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రైతులకు మరింత సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజాసేవలో మరింత సేవచేయడానికి ఈ పదవి ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం రెడ్డి సంఘం, సుభాష్ యూత్ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.

## ఆర్టీసీ బస్సు కోసం హైరానా

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్4: ప్రతిరోజూ పదిర నుంచి వీర్నపల్లి మోడల్ స్కూల్, ఎల్లారెడ్డిపేట స్కూల్‌కు 25మంది విద్యార్థులు వెళ్తుంటారు. జీపీ ఆవరణలో విద్యార్థులను ఎక్కించుకుని పోతుంటారు. కానీ అదే ఏరియాలో వినాయక మండపం ఉండడం, అక్కడ బస్సు మలుపు తిప్పే అవకాశం లేకపోవడం.. అంతకు మించిన దూరం వెళ్లలేమని ఆర్టీసీ డ్రైవర్ తేల్చిచెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హైరానా పడ్డారు. దీంతో వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ రమాకాంత్‌కు సమస్యను విన్నవించారు. ఆయన వెంటనే ఆర్టీసీ అధికారులతో మాట్లాడగా, ఎండీ సానుకూలంగా స్పందించారు. బస్సును పంపిస్తామని హామీఇవ్వడంతో తల్లిదండ్రులు శాంతించారు.














